# ఏరు

శ్రీమతి [illegible]

సన్నని ఆ కాలిబాట వెంట వడివడిగా నడుస్తున్నాడు మధుసూధన్. మధ్యాహ్నపు ఎండ చాలా తీక్షణంగా వుంది. నడుస్తున్నవాడు ఒక్కసారి ఆగి రుమాలుతో నుదుటిమీద చెమట తుడుచుకుని గాఢంగా నిట్టూర్చాడు చుట్టూ చూస్తూ. దూరంగా



మందగమనంతో ప్రవహిస్తున్న ఏరు కనిపించింది. చుట్టూ ఎటు చూసినా పచ్చని వరిచేలూ, చేలగట్లమీద వరుసలుగా నిలబడిన కొబ్బరి చెట్లూను. ఆ మిట్ట మధ్యాహ్నం ఎండలో, ఆ ఆకుపచ్చని ప్రకృతి మధ్య అతను వేసుకున్న సూట్, బూట్లు చాలా కృత్రిమంగా అసహజంగా వున్నాయి. ఇవేవీ అతను పట్టించుకున్నట్లు లేదు. ఉక్కని భరించలేక వేసుకున్న జాకెట్ విప్పేసి చేత్తో పట్టుకుని ఏరు వంక నడవసాగాడు మధు. కాస్సేపు అక్కడ కూర్చోగానే ప్రాణం లేచి వచ్చింది అతనికి. ఒక్కసారి అలసట అంతా తీరిపోయినట్లు అనిపించింది. ఏరు మీదుగా వచ్చేగాలి చల్లగా, హాయిగా అతన్ని తాకింది.

ఈ ఏరుకీ తనకీ వున్నది ఎప్పటి అనుబంధం! తను చిన్నప్పుడంతా ఆ పల్లెలో పుట్టి పెరిగాడు. చిన్నతనం గురించి తనకు ఏమి మధురస్మృతులు లేవు. అన్నీ కష్టాల కథలే! చిన్నతనం గురించిన భయంకర జ్ఞాపకాలే! మనస్సు చిన్నబోయినప్పుడూ,. తన నెవరైనా మాటలతో బాధించినప్పుడు ఈ ఏటి గట్టుకు వచ్చి కూర్చునే వాడు తను. ఏటిలోని అలలను చూస్తుంటే మనసుకి ఎంతో ఊరట కలిగేది. అమ్మ వెతుక్కుంటూ వచ్చి తనను బ్రతిమాలి వెనక్కు తీసుకు వెళ్ళేది.

ఈ ఏటి నుండి పది నిముషాలు నడుస్తే తన పల్లె వస్తుంది. తన తాత ముత్తాతలంతా పల్లెలోనే వుండేవారు. తనకి జ్ఞానం తెలిసేటప్పటికే తండ్రి పోయాడు. తాతలనాటి ఇల్లు అప్పుల వాళ్ళ పాలయింది. అమ్మ అక్కడే వున్న ఒక డాక్టరు గారింట్లో వంటమనిషిగా జేరింది. తను వంట పని చేస్తూ తనకు చదువు చెప్పించింది.

తనను అందరూ "వంటావిడ భారతమ్మగారి కొడుకు" అంటూనే రిఫర్ చేసేవారు. డాక్టరిగారి పిల్లాడు, ఇంజనీరు గారి అబ్బాయి వగైరా టైటిల్స్ ఎప్పుడు లేవు తనకు. వాళ్ళ పిల్లల్ని, వాళ్ళు తమ తండ్రులని గురించి చెప్పుకుని గర్వపడే తీరూ చూస్తే, తనకు చాలా అసూయ, బాధ కలిగేది. డాక్టరుగారు తన కొడుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని "బాబూ ప్రసాద్! నువ్వు అమెరికా వెళ్ళి పెద్ద చదువులు చదివి గొప్పవాడి వవ్వాలి" అంటూ కొడుకుని ముద్దు పెట్టుకునే వారు. ఆ దృశ్యం చూసినప్పుడు తన మనస్సు తండ్రి లేనందుకు విలవిల్లాడేది. అమ్మ దగ్గరకు పరిగెత్తుకొని వెళ్ళి కొంగు పట్టుకుని ఏడ్చేవాడు.

డాక్టరుగారి పిల్లలు సుజాత, ప్రసాద్ తనతో చాలా స్నేహంగా వుండేవారు. సుజాత తనకంటే నాలుగేళ్ళు చిన్న. ప్రసాద్ తనకంటే ఐదేళ్ళు పెద్ద. ఎప్పుడూ ముగ్గురూ కలిసి ఆడుకుంటూ వుండేవారు.

ఇప్పుడు తనకున్న ఒకే ఒక కోరిక.... ఆ పల్లెకి వెళ్ళి తన ఐశ్వర్యం, చదువూ, దర్పా, పొజిషన్ అన్నీ పల్లె వాళ్ళకి చూపించుకోవాలి. ముఖ్యంగా డాక్టరుగారి ఇంట్లో అందరూ తనను చూసి జెలసీ ఫీల్ అవ్వాలి. వంట మనిషి కొడుకైనా సరే, ఎవరైనా సరే కష్టపడితే ఎంతటి ఉన్నత శిఖరాలని అధిరోహించగలరో అందరికి తెలియ జేయాలి!

అమెరికా నుండి ఇండియాకు విజిట్‌కి వచ్చి, మళ్ళీ ఈ పల్లె చూడడానికి రావడానికి మరో కారణం కూడా వుంది. అమ్మకు చేసిన ప్రామిస్! తాతలనాటి ఇల్లు, నాన్న పోయాక, రక్షించుకోలేక అమ్మ ఏడిచిన ఏడుపు తను ఎప్పటికి మరిచి పోలేదు. అమ్మని ఊరుకోబెట్టడానికి చిన్నపిల్లాడైన తను చేస్తున్న ప్రయత్నాలు చూసిన వాళ్ళు కంట తడిపెట్టుకున్నారు.

"బాబూ! అమ్మలా నువ్వు ఏడవకు. పెద్దాడవయ్యాక ఈ ఇల్లు మళ్ళీ కొను. మీ తాతలనాటి ఇల్లు నువ్వు తిరిగి సంపాదించుకోవాలి" అన్నారు అప్పటి తన మాష్టారు రామనాధం గారు తన తల నిమురుతూ. ఆయన మాటలు తన చిన్నారి మనసులో గాఢంగా నాటుకున్నాయి. ఇవాళ ఆ ఇంటికి వెళ్ళి, అక్కడ ఎవరు నివసిస్తున్నా సరే, ఎంత ధర అడిగినా సరే.... ఆ ఇల్లు కొనేసి, ఆ ఇల్లు వున్న స్థానంలో ఒక పెద్ద మేడ కట్టేసి, తాతలనాటి తన లోగిలి, గర్వంగా ఆ పల్లెలో తలెత్తుకు నిలబడేటట్లు చెయ్యాలి. ఆ ఊహతోనే అతని శరీరం

గగుర్పాటు చెందింది. మనస్సు నూతనోత్సాహంతో నిండి పోయింది.

జేబులో రుమాలు తియ్యబోతూంటే ఒక "ఎన్వలప్" క్రిందపడి దాంట్లో వున్న ఫోటోలు చెల్లా చెదురయ్యాయి. అవి వంగి చేత్తో తీసుకొని వాటిమీద వున్న మట్టి దులిపాడు. అందమైన నలుగురి అమ్మాయిల ఫోటోలు. తన పెళ్ళి సంబంధం కోసం వచ్చిన అమ్మాయిల ఫోటోలు. అంతా ధనవంతుల బిడ్డలే! పెద్ద చదువులు చదువుకున్న వారే! ఇవన్నీ డాక్టర్ గారికి చూపించాలి. అప్రయత్నంగా చిన్న తనంలో ఆయన అన్న మాటలు గుర్తు వచ్చాయి మధూకి.

చిన్నప్పుడు సుజాత ఒకసారి "మధూ! బువ్వాలాట ఆడుకుందాం రా! నువ్వు మొగుడూ, నేను పెళ్ళామూనూ...." అంటూ పిలిచిందితన్ని. అక్కడే హాల్లో పేపరు చదువుకుంటున్న డాక్టర్‌గారు మండిపడ్డారు. "సుజీ! అలా ఎప్పుడూ అనకు. నీకు వంటావిడ కొడుకుని పెళ్ళి చేసుకునే ఖర్మ ఏమిటి! దర్జా అయిన సంబంధం చూసి చేస్తాను" అంటూ సుజాని దగ్గరకి పిలిచి ముద్దు పెట్టుకున్నారు.

"ఛీ! ఫో! నువ్వు నా మొగుడివి కావు!" అంటూ నాన్నగారి అండ చూసుకుని తనని ఛీత్కారం చేసింది. తను వస్తున్న ఏడుపుని ఆపుకుందుకు విశ్వ ప్రయత్నం చేస్తూ వంటింట్లోకి పరిగెత్తి అమ్మని పట్టుకుని బావురుమని ఏడ్చాడు.

డాక్టరుగారికి తప్పకుండా తనకు వచ్చిన గొప్ప గొప్ప సంబంధాల గురించి చెప్పాలి. మధూలో అణువణువూ ప్రతీకారం కోరింది తనకు చిన్నప్పుడు జరిగిన అవమానానికి.

ఆ పల్లెకి వెళ్ళి తన ఐశ్వర్యం చూపించుకుంటే తప్పించి తనకున్న హోదాకు విలువ లేదనిపించింది ఆ క్షణంలో మధూకి.

"ఎంత ఐశ్వర్యం సంపాదించినా అందరి ముందూ ఎంతో నిరాడంబరంగా వుండే తను, పల్లె అనగానే ఎందుకు ఇంత అహంకారం నిండిన మనస్సుతో ఆలోచిస్తున్నాడు?" మనసులో ఒక మూల గిల్టీగా ఫీల్ అయ్యాడు.

"చిన్నప్పుడు నీవు గడిపిన చిన్నతనమే ఈ అహంకారానికి కారణం!" అంటూ మనసు మరో మూల సర్ది చెప్పసాగింది.

లేచి నిలబడి తన ఖరీదైన పాంట్సుమీద అంటిన దుమ్ముని గట్టిగా దులుపుకున్నాడు. అమెరికాలో కొన్న అతి ఖరీదైన అతని సూటు మురికిగా అయింది. తను వేసుకున్న సూట్ వైపు అపురూపంగా చూసుకున్నాడొకసారి. ఆ పల్లెలో తను ఎప్పుడూ "ఓవర్ సైజ్" బట్టలు వేసుకునే బ్రతికాడు. తనకంటే పెద్దవాడైన ప్రసాద్ వెలిసిపోయిన బట్టలూ, అప్పుడప్పుడు డాక్టరుగారు కొనిచ్చిన బట్టలూ వేసుకుని బ్రతికాడు. తన ఇష్ట ప్రకారం బట్టలు కొనిపెట్టేవారు ఎవరూ లేరు తనకు. ఆ క్షణంలో తన బ్రతుకుమీద తనకే జాలి వేసింది మధూకి.

* * * *

పరిచయమున్న ఆ ఇంటి గుమ్మం వైపు ఉత్సాహంగా నడిచాడు మధూ! వీధి గుమ్మం తలుపు వేసి వుంది. మునపట్లా అక్కడ సందడిగా లేకపోవడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఎప్పుడూ నిత్య కల్యాణం పచ్చతోరణంలా వుండేది ఆ ఇల్లు. నిత్యం పది మంది ఆ ఇంట భోజనానికి లేచేవారు. వున్నది ఇద్దరే పిల్లలయినా వచ్చి పోయే అతిథుల కోసం డాక్టరు గారికి అమ్మ వంట సాయం కావలసి వచ్చేది.

ఇంటికి ఎవరైనా వస్తే, "భోజనానికి లేవండని" సరాసరి వాళ్ళని వంటింట్లోకి తీసుకు వెళ్ళడమే డాక్టరు గారికి తెలుసు. ముందు వంటింట్లోకి వెళ్ళి భార్యతో చెప్పడం వగైరా అలవాట్లు లేవు ఆయనకు. ఆయన పిలిచే అతిథులకీ, అమ్మ రుచిగా చేసే వంటలకీ, డాక్టరుగారి భార్య విమలమ్మగారు చూపించే మర్యాదలకి చక్కగా సరిపోతుందని అంతా అనుకునే వారు ఆ రోజుల్లో.

ఏ సందడీ లేకుండా బావురుమంటున్న ఆ ఇంటి గుమ్మం మధూ మనస్సుని కలచి వేసింది ఎందుకనో! ఆ వీధి గుమ్మం వైపు దొడ్డిలోనే ఎప్పుడూ తనూ, సుజాత, ప్రసాద్ ఆడుకునే వారు. అపురూపంగా ఆ పరిసరాలన్నీ చూస్తున్నాడు మధూ వీధి గుమ్మం దగ్గరే నిలబడి.

"బాబూ! నువ్వు ప్రసాద్ స్నేహితుడవా! నేను పెద్దదాన్ని అవుతున్నాను. నీ పేరు గుర్తులేదు బాబూ!" తలుపు తెరుస్తున్న విమలమ్మగారి మాటలకి ఉలిక్కిపడి తలెత్తి చూశాడు మధు.

నిశ్చేష్టుడయ్యాడు. నోట మాట రాలేదు. ఎప్పుడూ కలకలలాడుతూ బోలెడు నగలూ, నుదుట పెద్ద కుంకం బొట్టూ, పూలూ, జరి చీరలలో కనిపించే ఆవిడ బొట్టులేని ముఖం, తెల్ల చీర....

"అమ్మగారూ! నేనూ మధూ నండి" అన్నాడు గొంతు పెగుల్చుకుని. ఆవిడ గుర్తు తెచ్చుకుందుకు ప్రయత్నం చేస్తోంది.

"నేనమ్మా! మీ ఇంట్లో వంటావిడ భారతమ్మగారి కొడుకుని" అన్నాడు మధూ.

ఆవిడ కళ్ళలో సన్నని కన్నీటి తెరలు వాలాయి. ప్రశంసతో కూడిన ఒక చిరునవ్వు ఆవిడ పెదాలపైన వెలిసింది.

"చాలా సంతోషం బాబూ! నువ్వు బాగా పైకి వచ్చినట్టున్నావు. భారతమ్మ అనుకున్నది సాధించింది. మీ అమ్మను కూడా తీసుకు రావలసింది. ఇక్కడ వున్నన్నాళ్ళూ నాకు ఒక అక్కలా వుండేది భారతమ్మ" ప్రేమ, ఆప్యాయత పొంగి పొర్లాయి ఆవిడ మాటల్లో.

మధూ కళ్ళు అప్రయత్నంగా చమర్చాయి.

"అమ్మగారూ! నేను అమెరికాలో మంచి ఉద్యోగంలో సెటిల్ అయ్యాను. నేను ఇంత పైకి వచ్చాక, సరిగ్గా సుఖపడే రోజుల్లో అమ్మ బ్రతికి లేదు" నిస్సహాయత, వేదనా తొంగి చూస్తున్నాయి మధు మాటల్లోనూ, ముఖంలోనూ.

"బాబూ! బాధపడకు. ఎక్కడ వున్నా ఆవిడ ఆత్మ శాంతిస్తుంది" కళ్ళు చీర కొంగుతో వత్తుకుంటూ



అన్నారు ఆవిడ.

"లే బాబూ! అన్నం తిందువుగాని...." అంటూ వంటింటి వైపు దారితీస్తున్న ఆవిడ వెనకే వెళ్ళాడు మధు.

చాలా తృప్తిగా, సంతోషంగా వుంది మధూకి ఆ వంటింట్లో కూర్చుని భోజనం చేస్తుంటే. తనూ, ప్రసాద్, సుజాత అక్కడే కూర్చుని భోజనం చేసేవారు. సుజాత తన కిష్టంలేని వన్నీ తన కంచంలో పడేస్తూ వుండేది. అమ్మ చూడకుండా. చిరునవ్వు వెలిసింది మధూ పెదాలపైన.

విమలమ్మగారు కొసరి కొసరి వడ్డిస్తూ తన కష్ట సుఖాలు చెప్పుకుంటున్నారు. పెళ్ళయిన ఏడాదికే భర్త మరణించి పుట్టింటికి చేరిన సుజాత గురించి, ఎమ్. ఏ. పాసైనా ఉద్యోగం సంపాదించుకోలేక పోతున్న తన కొడుకు గురించి, కూర్చుని తింటూంటే తరిగి పోతున్న ఆస్తుల గురించి ఆవిడ చెప్తూంటే, మధూ మనస్సు వికలమైంది. అన్నం గొంతు దిగలేదు. మెల్లిగా చెయ్యి కడుక్కుని వీధి గదిలోకి వెళ్ళాడు మధూ. మధు కళ్ళల్లో నిండిన నీరు చూసి అతనిని ఇంకా భోజనం చెయ్యమని బలవంతం చెయ్యలేక పోయారు విమలమ్మగారు.

వీధి గదిలో నిలువెత్తు డాక్టరుగారి ఫోటో వుంది. ఆయన అక్కడ నిలబడి సంతోషంగా తన వైపే చూస్తున్నట్లుగా వుంది. అప్రయత్నంగా చేతులు జోడించి ఆయనకు నమస్కరించాడు మధూ.

ఆయన మాటల వల్ల తను చిన్నప్పుడు బాధపడినది నిజమే! కాని ఆయన చూపించిన ఆప్యాయతను తను మరిచి పోలేదు! తండ్రిలేని తనకు, ఒక రకంగా, తండ్రి లాగానే ఆయన బాధ్యత తీసుకున్నారు. తనను స్కూల్లో మొదట చేర్పించినది ఆయనే! తనకి మొదట ఇంగ్లీషు నేర్పించినది ఆయనే! ఒకసారి తనకి టైఫాయిడ్ వస్తే, ఆయన రూమ్‌లో తనను పడుకోబెట్టుకుని కంటికి రెప్పలా చూసుకున్నారు.

ఆ క్షణంలో మధూ తన డాబూ, దర్పం అన్నీ మరిచి పోయాడు. అతని హృదయం ఆ ఇంట్లో అందరిపట్లా ప్రేమతో నిండి పోయింది.

* * * *

"పోనీలే బాబూ! మా బిడ్డల్లో ఒక బిడ్డగా పెరిగావు. నువ్వేనా వృద్ధిలోకి వచ్చినందుకు సంతోషంగా వుంది నాకు" వక్కపొడి అందిస్తూ అన్నారు విమలమ్మగారు.

"సుజాత ఎంతవరకూ చదివిందండీ!" అడిగాడు మధూ వక్కపొడి అందుకుంటూ.

"బి.య్యే. అయింది. ఇప్పుడు ప్రయివేటుగా యమ్.ఏ. చదువుతోంది. కాలక్షేపానికి ఇక్కడే పక్క వీధిలో వున్న కాన్వెంట్‌లో పని చేస్తోంది. అది ఎమ్.ఏ. అవ్వగానే ఏదన్నా మంచి ఉద్యోగంలో చేరితే నాకు మనశ్శాంతిగా వుంటుంది. ప్రసాద్‌కి కూడా ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదన్న ఆశ నాలో చావ లేదు బాబూ!"

"అమ్మగారూ! పది మందికి అన్నం పెట్టిన లోగిలి ఇది. తప్పకుండా మీ పిల్లల జీవితాలు బాగు పడతాయి. నాకు ఆ నమ్మకం వుంది" నిండు మనస్సుతో అన్నాడు మధూ.

"బాబూ! నీ చల్లని మాటలు నిజమైతే అంతకంటె నాకు కావలసినది ఏముంది" గాఢంగా నిట్టూర్చారు విమలమ్మగారు.

* * * *

తన ముత్తాతగారు కట్టించిన పెంకుటిల్లు అది! సగం కూలిపోయి శిథిలావస్థలో వుంది. ఆ ఇల్లు కొన్నవాళ్ళు ఏమీ పట్టించుకున్నట్లు లేదు. ఆ ఇంటిని తను సొంతం చేసుకోవాలి! తన ఇంటిని, తన తాతలనాటి ఇంటిని తను సొంతం చేసుకోవాలి. ఆ ఇంటిని ఈ ఊర్లో గర్వంగా తలెత్తుకుని నిలబడేటట్లు చెయ్యాలి. తరువాత ఆ ఇంటిని ఏదన్నా బ్యాంకుకి ఇస్తే తను ఖర్చు పెట్టిన డబ్బు అంతా వెనక్కు తిరిగి వస్తుంది. మధూలో వున్న సెంటిమెంట్స్, బిజినెస్‌మైండ్ పోటీలు పడి ఆలోచనలు చేస్తున్నాయి.

ఆ ఇంటి వీధి తలుపులు బార్లా తెరిచి వున్నాయి. హాల్లో పడక్కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న రామనాథం మేస్టారు బూట్ల చప్పుడు విని తలెత్తి చూశారు. "ఎవరు కావాలి బాబూ!" అన్నారు తన దగ్గర చదువుకున్న స్టూడెంట్స్‌లో ఇతను ఎవరై వుంటారా అని ఆలోచిస్తూ.

"నేను మాస్టారూ! మధూని.... మధుసూధన్‌ని.... వంటలు చేసే భారతమ్మగారి కొడుకుని" అనుకోకుండా మాస్టారు అక్కడ కనపడడంతో సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు మధూ.

"నువ్వా బాబూ! ఏం చేస్తున్నావు ఇప్పుడు. ఇలా నా పక్కనే ఈ బల్లమీద కూర్చో!" వాత్సల్యంగా అన్నారు మాస్టారు.

తను ఈ ఊరు విడిచి వైజాగ్ వెళ్ళడం, అక్కడ తల్లి వంటలు చేస్తూ తనని యూనివర్శిటీలో చదివించడం, తరువాత స్కాలర్‌షిప్ మీద అమెరికా చదువుకోవడానికి వెళ్ళడం, అక్కడ బాగా సెటిల్ అవ్వడం.... అన్నీ మాస్టారికి చెప్పుకున్నాడు.

మాస్టారి కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"చాలా సంతోషం బాబూ! నాకు నీలాంటి శిష్యుడున్నందుకు చాలా గర్వంగా వుంది!" మధూ వీపు మీద ఆప్యాయంగా తట్టారు మాస్టారు.

మాస్టారి యోగక్షేమాలు అడిగాడు మధు.

ఎప్పుడూ సరిపోని తన పెన్షన్ డబ్బూ, రోగిష్టి భార్యా, తన కుటుంబమే పోషించుకోలేని తన కొడుకు పరిస్థితి, శిథిలావస్థలో వున్న ఆ ఇంటిని చాలా తక్కువ ఖర్చుకు తన కిచ్చిన భూకామందు ఔదార్యం, ఆ ఇంటిని అమ్మాలని ప్రయత్నిస్తున్న భూకామందు ప్లాన్.... అన్నీ మధూకి చెప్పుకుంటూ,

"బాబూ! ఈ ఇల్లు అమ్మకమైతే, నా బ్రతుకు ఇంక రోడ్డుమీదే బాబూ! ఈ మాత్రం ప్రశాంతత కూడా లేనట్లుంది నా జీవితానికి." బాధగా అన్నారు, మాస్టారు.


మాస్టారి చిరుగు పట్టి మాసిపోయిన చొక్కా, పంచెల వైపూ, కొద్దిగా విరిగి వెలిసి పోయిన పడక్కుర్చీ వైపు జాలిగా చూశాడు మధూ.

"నీకు కాఫీ కూడా ఇవ్వలేను నేను. నెలాఖరు, రోజులు. నా చేత్తో కాసిని మంచి నీళ్ళయినా ఇవ్వనీ. నా కోసం కష్టపడి ఎండలో చూడడానికి వచ్చావు." మంచి నీళ్ళు తీసుకు రావడానికి వంట ఇంటిలోకి వెళ్ళారు మాస్టారు.

మాస్టారు ఎప్పుడూ తన ఉద్యోగం అంటే ఒక పవిత్రమైన బాధ్యతగా, చాలా సీరియస్‌గా తీసుకునేవారు. పిల్లలకి ఎప్పుడూ దేశభక్తి, నీతి, నిజాయితీ, సత్ప్రవర్తనలను గురించి బోధించేవారు. స్కూల్లో పిల్లలంతా తన సొంత బిడ్డలే అన్నంత ప్రేమతో చూసేవారు. ఏ పిల్లలకి ఏ "డౌట్స్" వచ్చినా, ఆయన ఇంటికి వెడితే "ఫ్రీ"గా ట్యూషన్ చెప్పేవారు. తను తరచూ మాస్టారి దగ్గరకు వెళ్ళి లెక్కలు చెప్పించుకునే వాడు.

"అందరు మాస్టార్లు ట్యూషన్‌లు చెప్పి బోలెడు డబ్బు సంపాదిస్తున్నా, మీరు మటుకు గంటల కొద్దీ ఫ్రీగా ప్రయివేట్లు చెబుతారు" అంటూ సతాయించేది మాస్టారుగారి భార్య.

"డబ్బు ఒకటేకాదే కావలసింది మనిషికి. ప్రిన్సిపల్స్.... ప్రిన్సిపల్స్ వుండాలి" అంటూ దర్పంగా పలికేవారు మాస్టారు.



అలాంటి మాస్టారు ఈ రోజు కటిక దరిద్రం అనుభవిస్తున్నారు. రేపు నిలువ నీడ కూడా వుండదేమోనని భయపడు తున్నారు. మధూ మనస్సు చివుక్కు మంది.

తనా ఇల్లు కొని ఉద్ధరించబోయే విషయాలు ఆయన ముందు ఎత్తడానికి ధైర్యం చాలలేదు మధూకి.

* * * *

"వస్తాను ప్రసాద్! మళ్ళీ సరిగ్గా వారం రోజుల్లో వస్తాను" అంటూ ప్రసాద్‌కి "బై" చెప్పి సన్నని కాలిబాట వెంట నడక సాగించాడు మధూ పట్నం వైపు.

ఏదో చెప్పలేని సంతోషం, తృప్తితో అతని మనస్సు నిండి పోయింది. జీవితానికి ఒక సార్థకత లభించినట్లు ఫీలయ్యాడు. అతను వేసుకున్న కాటన్ షర్ట్, కాటన్ ప్యాంటుకి ఆ ఎండలో ఎంతో హాయిని చేకూరుస్తున్నాయి. కాళ్ళకి వేసుకున్న ఆకు చెప్పులు ఆ గతుకుల బాట మీద నడవడానికి చాలా "కంఫర్టబుల్"గా వున్నాయి.

ఆ పల్లెకి ఏం సాధించాలని వచ్చాడు తను? ఏం సాధించాడు? తనకితనే నవ్వు కున్నాడు మధూ.

ప్రతీకార వాంఛతో అహంకారం నిండిన మనస్సుతో ఆ పల్లెకి వెళ్ళాడు తను. అక్కడి మనుష్యులనూ, వాళ్ళ ప్రేమాభిమానాలనూ చూడగానే ముడుచుకుని వున్న తన మనస్సు విచ్చుకుంది. మనస్సులో మమకారం తప్ప మరే భావమూ తొంగి చూడలేదు.

"వంటలు చేసే భారతమ్మగారి కొడుకు నంటూనే" అందరికి పరిచయం చేసుకున్నాడు.

తను కొంత పెట్టుబడి పెట్టి ప్రసాద్‌చేత బిజినెస్ పెట్టించడానికి ఒప్పించాడు. పెళ్ళి కూతురు కోసం చూస్తున్న తనకు సుజాత, దేవుడు పంపించిన కానుకలా కనిపించింది.

సుజాతని ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. చిన్నప్పటి నుండీ తెలిసిన సుజాత కంటే మంచి అమ్మాయి తనకు దొరుకుతుందని నమ్మకం లేదు.

మంచి వ్యక్తిత్వం, చదువు, గుణం, అందం, నిరాడంబరత, మంచితనం– కలిస్తే సుజాత లాంటి వ్యక్తి ఉద్భవిస్తుంది. షర్టు జేబులోంచి సుజాత ఫోటో తీసి మెల్లిగా ముద్దు పెట్టుకున్నాడు మధూ.

తన తాతలనాటి ఇల్లు కొనేశాడు తను. ఆ ఇల్లు 'మంచి షేప్'కి తీసుకు వచ్చే బాధ్యత ప్రసాద్‌కి అప్పగించాడు. ఒక వైపు పోర్షన్‌లో రామనాథం మేస్టారు అద్దె లేకుండా వుండేటట్టు, మరొక వైపు పోర్షన్ అద్దెకిచ్చి, ఆ అద్దె డబ్బు రామనాథం మాస్టారికి చెందేటట్లు ఏర్పాటు చేశాడు.

తన ప్లాన్స్ చెప్పగానే మాస్టారి కళ్ళలో వెల్లి విరిసిన ఆనందం చూడగానే జన్మ సఫలమైనట్లే అనిపించింది తనకు.

"బాబూ! నువ్వు వెయ్యేళ్ళు వర్ధిల్లు బాబూ!" మాస్టారు ఆశీర్వదించారు.

"మాస్టారూ! మీలా ప్రిన్సిపల్స్ వున్న వ్యక్తుల్ని దేవుడు ఎప్పుడూ చల్లగా చూస్తాడు." చేతులు జోడించి మాస్టారికి నమస్కరించాడు తను.

నిండుగా గలగలా ప్రవహిస్తూ మధూని ఆహ్వానిస్తోంది ఏరు. ఏటి ఒడ్డున గడ్డిమీద చతికిల బడ్డాడు మధు. ఆ ఏటిని తను ఎన్నో రూపాల్లో చూశాడు తను.


ఎండాకాలం ఎండిపోయి, చిన్నబోయి వుండేది ఈ ఏరు! మిగిలిన టైమ్‌లో గలగలా ప్రవహిస్తూ ఈ రోజు లాగానే నిండుగా, అందంగా వుండేది.

ఏ కాలంలోనైనా సరే, ఏ "షేప్"లో వున్నాసరే, ఈ ఊరిని అంటిపెట్టుకుని, ఈ ఊరి వాళ్ళకు అండగా అక్కడే నిలబడి వుంది అందాల సెలయేరు.

ఆ ఏరు లాంటి తన మనస్సు గుర్తుకు వచ్చి నవ్వుకున్నాడు మధూ. తన మనస్సులో ఈ ఊరుపట్ల, ఇక్కడ మనుష్యుల మధ్యా ఏ రకమైన తాత్కాలిక కోపతాపాలున్నా, తన మనస్సులో అట్టడుగున గలగలా నిండుగా ప్రవహించే మమకారాల సెలయేరు ఎప్పుడూ తను పుట్టి పెరిగిన ఈ ఊరినీ, ఈ ఊరివాళ్ళనీ అంటి పెట్టుకునే వుంటుంది.

ప్యాంట్ జేబులోంచి పెళ్ళి కూతుళ్ళ ఫోటోలు తీసి ముక్కలు ముక్కలుగా చేసి ఏరులో పడేశాడు మధూ. □

# ఇ·వేమన·పద్యాలు




నీళ్ళు పోసి కడగి నిత్యంబు శోధించి
కూడు పెట్టి పైన కోక గట్టి
యేమి పాటు పడుదురీ దేహి గ్రంధికి
విశ్వదాభిరామ వినురవేమ.